నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 4 అక్టోబర్ 2024 | HYDERABAD

- ఎఫ్‌ఆర్‌ఎల్ గీతలోపే పుట్టగొడుగుల్లా నిర్మాణాలు
- సందిగ్ధంలో సామాన్యుల బతుకులు
- ఇప్పట్లో ఆగని సర్కారు దమనకాండ
- పరీవాహక ప్రాంతాల్లో ఇప్పటికే బాధితుల అవస్థలు
- మిగతా కూల్చివేతలు కొనసాగితే.. అరణ్యరోదనలే




RB-X

# మూసీ మార్కింగ్‌లో లక్షన్నర ఇండ్లు?

## గుబులు పుట్టిస్తున్న గూగుల్ మ్యాప్



**ఎన్నో ఏండ్ల కష్టం..** జీవిత కాలం శ్రమ.. పైసా పైసా కూడబెట్టి.. లక్షలు అప్పు చేసి.. నిర్మించుకున్న సామాన్యుల 'కలల' గృహాలు 'మూసీ సుందరీకరణ'కు బలి కానున్నాయా..?..ఒకటి కాదు.. రెండు కాదు.. లక్షన్నర వరకు నిర్మాణాలు నేల మట్టం అవుతాయా..? ఇప్పుడు నగరవాసులను తొలుస్తున్న ప్రశ్నలివి. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) రూపొందించిన గూగుల్ మ్యాప్ చూస్తే.. ఇంకెందరి బతుకులు ఆగమవుతాయోనన్న భయం వేస్తున్నది. మ్యాప్‌లో కేవలం ఎఫ్‌ఆర్‌ఎల్ (ఫుల్ రివర్ లెవల్) గీతలోపే పుట్టగొడుగుల్లా నిర్మాణాలు కనిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం అక్కడి నుంచి బఫర్ జోన్‌ను లెక్కిస్తే..దాని పరిధిలోకి వచ్చే కట్టడాలు ఊహించుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న అడుగుల తీరు లక్షలాది సామాన్యుల గుండెల్లో రైళ్లను పరిగెత్తిస్తున్నాయి. ఇటీవలే పరీవాహక ప్రాంతాల్లో 150 వరకు ఇండ్లు నేలమట్టం చేశారు. ఆ బాధితుల రోదన.. ప్రస్తుతం వారు పడుతున్న అవస్థలు చూస్తుంటే.. ప్రతి ఒక్కరి మనసును కలిచివేస్తున్నది. ఎంఆర్‌డీసీఎల్ అధికారులు రూపొందించిన మ్యాపులో అవుటర్ రింగు రోడ్డు వరకు నది ప్రవాహ మార్గం దాదాపు 54 కిలోమీటర్ల మేర ఉంది. ఆ పరిధిలో లక్షన్నర వరకు నిర్మాణాలు కూడా ఉండొచ్చని మూసీపై అధ్యయనం చేస్తున్న నిపుణుడు ఒకరు అభిప్రాయపడ్డారు. కానీ అధికారులు మాత్రం ప్రస్తుతం కేవలం రివర్ బెడ్‌కు మాత్రమే పరిమితమవుతామంటున్నారు. అయితే మూసీ నిర్మాణాలపై సర్కారు దమనకాండ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. ముమ్మందు అడుగులు ఎలా ఉంటాయనేది సమాధానం లేని ప్రశ్నే.

-సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ)




*ఎలాగైనా ఆపరేషన్ రివర్ బెడ్‌ను విజయవంతం చేయాలనే ప్రయత్నంలో అధికారులు..విడదీసి..తరలించు..సూత్రాన్ని అనుసరిస్తున్నారు. ఓ వైపు మూసీ నిర్వాసితుల నిరసనలు కొనసాగుతున్నా.. తమ పని తాము చేసేస్తున్నారు. నిర్వాసితులను విడదీసి.. ఇండ్లు ఖాళీ చేయించే ప్రక్రియను అమలు చేస్తున్నారు. అందులో భాగంగా రోజుకు కొందరి చొప్పున తహసీల్దార్ల బృందం రంగంలోకి దిగుతున్నది. మొన్న హిమాయత్‌నగర్‌లోని శంకర్‌నగర్, మూసానగర్ 150 ఇండ్లను నేలమట్టం చేశారు. ఇప్పుడు మరో 70 గృహాలను కూల్చివేతకు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం అధికారులు సైదాబాద్ నిర్వాసితుల ఇండ్ల పట్టాలు ముందే సిద్ధం చేసి.. వాటిని వారికి చూపించి ఖాళీ చేయాలని మంతనాలు జరిపారు. ఇలా ఒకక్రమ పద్ధతిలో విడదీసి ఇండ్లును కూల్చేసి తరలించే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా 30 కుటుంబాలను తరలించినట్టు సమాచారం. అయితే డబుల్ బెడ్రూంలు కేటాయిస్తామంటూ అధికారులు తమను బలవంతంగా తరలిస్తున్నారంటూ నిర్వాసితులు మాత్రం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదీఏమైనా.. హైదరాబాద్ మూసీ నిర్వాసితుల బతుకులు మాత్రం ఆగమవుతున్నాయి.*


*-సిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ)*




# విడదీసి.. తరలించి

## వ్యూహాత్మకంగా కదులుతున్న అధికారులు

**కొనసాగుతున్న.. ఇండ్లు ఖాళీ చేయించే ప్రక్రియ**



- పట్టాలు ముందే సిద్ధం చేసి.. నిర్వాసితులను ఒప్పించే ప్రయత్నం
- వర్షంలోనూ సాగిన అధికారుల మంతనాలు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నిర్వాసితులు
- 1595 నిర్మాణాల్లో అత్యధికంగా నాంపల్లిలో 604, బహదూర్‌పురాలో 527

ఆపరేషన్ రివర్ బెడ్ క్షణక్షణం ఉత్కంఠగా సాగుతున్నది. ఓ వైపు నిర్వాసితుల నిరసనలు కొనసాగుతున్నా... కదిలేదే లేదంటూ సమర శంఖం పూరిస్తున్నా.. అధికారులు మాత్రం చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. నిర్వాసితులను విడదీసి.. ఇండ్ల పట్టాలను సిద్ధం చేసి.. వారికి చూపించి..ఇండ్లు ఖాళీ చేయించేందుకు ఒప్పిస్తున్నారు. హైదరాబాద్ మూసీ పరీవాహక ప్రాంతంలో మొత్తం రివర్ బెడ్‌లో 1595 నిర్మాణాలను అధికారులు గుర్తిస్తే.. అందులో 945 ఇండ్లకు రెడ్ మార్క్ వేశారు. రివర్ బెడ్ అత్యధిక నిర్మాణాలు నాంపల్లిలో 604 ఉండగా, బహదూర్‌పురాలో 527 ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే కూల్చేసిన ఇండ్ల వారికి డబుల్ బెడ్రూంలు అందించామని చెబుతుండగా, కొందరు మాత్రం ఖాళీ చేసే ప్రసక్తే లేదంటున్నారు. మరికొందరు తప్పని పరిస్థితుల్లో ఒప్పుకోవాల్సిన దుస్థితి వస్తున్నదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

**కూల్చడమే ఎజెండా**

నిర్వాసితులు నిరసనలు తెలుపుతున్నా.. అధికారులు మాత్రం ఇండ్లు కూల్చడమే ఎజెండా పెట్టుకున్నారు. ఒక వేళ జేసీబీలు ప్రవేశిస్తే.. రణరంగంగా మారే పరిస్థితులున్నాయి. ఇదిలా ఉంటే రెడ్ మార్క్ వేసిన నిర్మాణాలను కూల్చివేయాలంటూ ఉన్నతాధికారుల నుంచి రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెరుగుతున్నది. అయితే నిర్వాసితులను ఒప్పించే ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయి. కొందరు ముందుకొచ్చినా డబుల్ బెడ్రూంల్లోకి వెళ్లాక అక్కడి పరిస్థితులు చూసి వ్యతిరేక గళం వినిపిస్తున్నారు. ఇలాంటి స్థితిలో ఆపరేషన్ రివర్ బెడ్ పూర్తవ్వడం తలకు మించిన భారంగా కనిపిస్తున్నది. క్షేత్రస్థాయి పరిస్థితులను ఉన్నతాధికారులకు వివరించినప్పటికీ ఎలాగైనా ఖాళీ చేయించి.. కూల్చాల్సిందేనని ఆదేశాలు వస్తుండటంతో అధికారులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నిర్వాసితుకులకు ఫోన్లు చేయడం, నేరుగా కలిసి మాట్లాడటం, కౌన్సెలింగ్ చేయడం వంటివి చేస్తున్నారు.

**మొత్తం 7,850 నిర్మాణాలు**

మూసీ బఫర్ జోన్ పరిధిలో డ్రోన్ సర్వే ప్రకారం మొత్తం 7,850 నిర్మాణాలు ఉన్నట్టు హైదరాబాద్ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇందులో హైదరాబాద్‌లో 5,250, రంగారెడ్డి, మేడ్చల్‌లో 2,600 వరకు నిర్మాణాలు ఉన్నట్టు తెలిపారు. వేలాది మంది కుటుంబాలు అక్కడ నివసిస్తున్నాయని చెబుతున్నారు. సరైన నిర్ధారణ లేకుండా లెక్కలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రివర్ బెడ్ కూల్చివేతలే గగనంగా మారడంతో బఫర్ జోన్ జోలికొస్తే నిర్వాసితులను ఎదుర్కోవడం కష్టమంటున్నారు.




# ఊహల నగరానికి మెట్రోనా?

## ఫోర్త్ సిటీకి మార్గం తప్పుడు నిర్ణయం

- కండ్లకోయ వరకు విస్తరించాలి
- రేవంత్ ఊహల్లో విహరించకు..
- ఎంపీ గా ఆనాటి మాటలు గుర్తు చేసుకో
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



వివరాలు IIవ పేజీలో

చెరువు కనిపిస్తే చాలు..

# నో పర్మిషన్!

- హైడ్రా కూల్చివేతలతో హెచ్‌ఎండీఏలో మారిన తీరు
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లతో సంబంధం లేకున్నా అనుమతుల నిరాకరణ

వివరాలు IIవ పేజీలో

తక్షణ సాయంలోనూ

# మెలిక



- 'పొదుపు' డబ్బుతో నిర్వాసితులకు పారితోషికం?
- స్వచ్ఛందంగా తరలివెళ్తేనే సాయమంటున్న వైనం

వివరాలు IIవ పేజీలో